తెలంగాణలో భారీగా ఐఎఎస్‌ల బదిలీ




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

పీఎస్సీతో తొలగనున్న లీగల్ చిక్కులు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 166 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 13 జూన్ 2025

# అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం



- టేకాఫ్ అయిన కాసేపటికే కుప్పకూలిన ఎయిరిండియా విమానం
- విమానంలో ఉన్న 242 మంది దుర్మరణం
- మృతుల్లో మాజీ సిఎం విజయ్ రూపానీ
- ఘటనపై ఆరా తీసిన హోంమంత్రి అమిత్ షా





**గాంధీనగర్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** మహా ఘోరం జరిగింది. గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో దాదాపు 242మంది మృత్యువాత పడ్డారు. మృతుల్లో మాజీ సిఎం విజయ్ రూపానీ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అహ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. మేఘానిలో ఎయిర్‌ఇండియా విమానం కూలిపోయింది. సివిల్ ఆస్పత్రి సమీపంలో విమానం చెట్టును ఢీకొట్టిన అనంతరం జనావాసాలపై కూలింది. టేకాఫ్ అయిన వెంటనే విమానం కూలి పోయింది. 242 మంది ప్రయాణికులతో ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 అనే విమానం అహ్మదాబాద్ నుంచి లండన్ కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. విమానంలో ఉన్న 242 మృతి చెంది ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు మిగతావి 2లో

## ఆర్థిక భద్రతలో సిఎలదే కీలక పాత్ర

### - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,12(పిసిడబ్ల్యూ న్యూస్):**దేశ ఆర్థిక ఆరోగ్య భద్రతను చార్టెడ్ అకౌంట్లు సమర్థంగా నిర్వహిస్తు న్నారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు చెప్పారు. జాతీయ స్థాయి సిఎ విద్యార్థుల సదస్సులో భాగంగా ముఖ్యోపన్యాసం ఇచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. సిఎ అంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదు, ఇది జాతి నిర్మాణంలో భాగస్వామ్యం అన్నారు. మీ నిజాయితీయే మీ అత్యంత విలువైన ఆస్తి. - టెక్నాలజీ, ఆటోమేషన్ వేగంగా మారుతున్న ఈ యుగంలో నైతికతకు కట్టు-బడి ఉండే అవసరం మరింత పెరిగింది. మీరు చేసే ప్రతి పని నిజాయితీ, సమన్యాయం, బాధ్యతను ప్రతిబింబించాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. భవిష్యత్ తెలంగాణను ప్రపంచ పటంలో నిలపాలనే లక్ష్యంతో, రాష్ట్ర ప్రభుత్వం అనేక మెగాపథకాలపై దృష్టిసారించినట్లు- భట్టి విక్రమార్క తెలిపారు. ముఖ్యంగా, హైదరాబాద్‌ను చార్టెడ్ అకౌంట్లకు ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పార్క్‌ల ద్వారా మిగతావి 2లో



## ప్రమాదంపై సిఎం రేవంత్ రెడ్డి విచారం

**హైదరాబాద్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** అహ్మదాబాద్ లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం కూలిపోయిన దుర్ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో దాదాపు 200 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారనే సమాచారం తెలియటంతో.. అందరూ సురక్షితంగా ఉండాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు. బాధితులను, వారి కుటుంబాలను ఆదుకోవడానికి వీలైనంత వేగంగా సమర్థవంతంగా సహాయక చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటు

### - వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురు మృత్యువాత



**ఆదిలాబాద్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటు ఆరుగురు రైతలను బలితీసుకుంది. వేర్పవేరు ప్రాంతాలో పిడుగపా టు కారణంగా మొత్తం ఆరుగురు మృతి చెందా రు. విత్తనాలు వేయడానికి వెళ్లిన సమయంలో పిడుగు పడడంతో ఈ దుర్ఘటన చోటుచేసు కుంది. అకాల వర్షం ఆరుగురు రైతులను పొట్టన బెట్టుకుంది. రెండు రోజులుగా అడపాదడపా కురిసిన వర్షాలతో విత్తనాలు వేసేందుకు సిద్ధమైన రైతుల కుటుంబాల్లో విషాదం నింపింది. ఏజెన్సీలోని గాదిగూడ మండలం పిప్పిరిలో 14 మంది రైతులు వ్యవసాయ కూలీలతో కలిసి మొక్కజొన్న విత్తులు వేసే క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. వర్షం నుంచి రక్షణ కోసం పొలంలోనే ఉన్న కర్రలతో ఏర్పాటు చేసిన గుడిసెలోకి అందరు వెళ్లారు. అదే సమయంలో గుడిసెపై పిడుగు పడింది. ఈ ఘటనలో పెందూర్ మాదర్రావు(45), సంజ(22), మంగం భీంబాయి (40), సిడాం రాంబాయి (45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన 10 మందిని తొలుత ఝరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఆ తరువాత రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. జిల్లాలోని బేల మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో పడిన పిడుగు పాట్లకు ఇద్దరు మహిళలు మిగతావి 2లో



## విమాన ప్రమాదంపై కేసీఆర్ దిగ్భ్రాంతి

- మృతులకు నివాళి.. బాధిత కుటుంబాలకు సానుభూతి
- పరిహారమిచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి

**హైదరాబాద్,12(పిసిడబ్ల్యూ న్యూస్):** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నివాసాలపై విమానం కూలిపోయిన ఘటనలో ప్రయాణికులు, సామాన్యులు, వైద్య విద్యార్థులు మరణించడంపై ఒక ప్రకటనలో విచారం వ్యక్తం మిగతావి 2లో

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి..

- వారంరోజుల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి పొంగులేటి ఆదేశం
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బలోపేతానికి ఉన్నతస్థాయి కమిటీ



**హైదరాబాద్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో సాధారణకంటే ఎకువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో గోదావరి కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారు లను ఆదేశించారు. గురువారం వరదలు, వానల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నష్టం జరిగిన తర్వాత కాకుండా ముందే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు.వీలైనంత మేరకు ప్రాణ, ఆస్తి, ఆర్థికనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విపత్తుల నిర్వహణ విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డీజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, ఆరోగ్యశాఖ కమిషనర్లతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కమిటీ వారంరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

## జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రుల్లో మార్పులు

### సీతక్కకు నిజామాబాద్ బాధ్యతలు



## విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలి

### - మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** గురు కులాల్లోని విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని, నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని సిబ్బందికి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ఆదేశించారు. గురువారం నుంచి విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బీసీ సంక్షేమశాఖ, గురుకుల సొసైటీ అధికారులు, సంక్షేమహాస్టళ్ల వార్డెన్లతో సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్స్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కారం కాకపోతే జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో అధికారుల దృష్టికి తేవాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, ఎంజేపీ సెక్రటరీ బడుగు సైదులు, జాయింట్ సెక్రటరీలు తిరుపతి, మద్దిలేటి పాల్గొన్నారు.

# ఆర్థిక భద్రతలో సిఎలదే కీలక పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. తెలంగాణ ఈ రోజు దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ- పడుతోంది. రీజినల్ రింగ్ రోడ్, మూసీ రివైటలైజేషన్, ఫ్యూచర్ సిటీ- ప్రాజెక్టుల వంటి యోచనలతో తెలంగాణ అభివృద్ధిలో మైలురాళ్లుగా నిలుస్తోంది,' అని డిప్యూటీ- సీఎం వ్యాఖ్యానించారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు భట్టి విక్రమార్క జ్ఞానాన్ని, నైతికతను రెండు చేతుల్లో పట్టు-కొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చార్టెడ్ అకౌంట్ల కృషి తెలంగాణ రైజింగ్ లో భాగస్వామ్యం కావాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకెళ్లేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటు

(మొదటి పేజీ తరువాయి)

మృతిచెందారు. సాంగిడిలో పొలం పనులు చేస్తున్న నందిని (30), సోన్కాస్‌లో పత్తి విత్తనాలు వేస్తున్న సునీ(35)పై పిడుగు పడడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం పొలం పనులకు వెళ్లినవాళ్లు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తు న్నాయి. ఉట్నూర్ మండలం కుమ్మరితాండలో వ్యవసాయ పనులు చేస్తున్న ముగ్గురు రైతులు రహదారిపై వెళ్తున్న దాదాపు 15 మంది బాటసారులు.. వర్షం రావడంతో పొలంలోని పశువుల పాకలోకి వెళ్లారు. ఆ సమయంలో పిడుగుపడటంతోనే కుమ్మరితాండలోని ఒకే కుటుంబానికి చెందిన రైతులు బోకన్ ధన్‌రాజ్ (27), నిర్మల (36), టోకన్ కృష్ణబాయి (30)లకు గాయాలయ్యాయి. తాంసీ మండలం బండలానాగాపూర్లోని రామాలయంపై పిడుగు పడటంతో పైనున్న ఆలయం గోపురం స్వల్పంగా ధ్వంసమైంది.

# విమాన ప్రమాదంపై కేసీఆర్ దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఆప్తులను కోల్పోయి శోకతప్త హృదయులైన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని, మృతుల కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కేంద్రంతోపాటు గుజరాత్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

# జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రుల్లో మార్పులు

### - సీతక్కకు నిజామాబాద్ బాధ్యతలు



**హైదరాబాద్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ ప్రభుత్వం జిల్లా ఇన్‌చార్జి మంత్రులను మారుస్తూ నిర్ణయం తీసుకున్నది. కేబినెట్‌లోకి కొత్తగా తీసుకున్న మంత్రులకు సైతం బాధ్యతలు అప్పగించింది. పాత మంత్రులకు కేటాయించిన జిల్లాలను మార్చింది. మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గడ్డం వివేక్ వెంకటస్వామి బాధ్యతలు అప్పగించింది. నల్లగొండకు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఖమ్మం జిల్లాకు వాకిటి శ్రీహరి, ఆదిలాబాద్‌కు జూపల్లి కృష్ణారావు బాధ్యతలు అప్పగించింది. నిజామాబాద్ ఇన్‌చార్జిగా సీతక్క, కరీంనగర్‌కు తుమ్మల నాగేశ్వర రావు, మహబూబ్‌నగర్‌కు దామోదర్ రాజనర్సింహా, రంగారెడ్డి జిల్లాకు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్‌చార్జిగా పొన్నం ప్రభాకర్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డికి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

# పీఎస్సీతో తొలగనున్న లీగల్ చిక్కులు

### - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉద్యోగ నియామక ప్రక్రియలో న్యాయపరమైన చిక్కులను తొలగించేందుకు పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్-సీ) చాలా దోహదపడు తుందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గురువారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నల్సార్ యూనివర్సిటీలో 'ఉద్యోగ నియామకాల్లో న్యాయపరమైన చిక్కులు' అంశంపై ఏర్పాటు చేసిన జాతీయ సదస్సులో యూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్‌తో కలిసి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. సదస్సు నిర్వహణలో టీజీపీఎస్సీ చొరవ చూపిందని అభినందించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ పీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామక ప్రక్రియలో వివాదాలను తగ్గించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లార్జ్ లాంగ్వేజ్ మాడల్స్, డిజిటలైజేషన్‌ను ఉపయోగించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. సదస్సులో టీజీపీఎస్సీ చైర్మన్ వెంకటేశం, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ఎయిర్ ఇండియా కూడా ఎక్స్ వేదికగా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. విమానంలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులతో పాటు ఒక కెనడా వాసి ఉన్నట్లు వెల్లడించింది. ఇందులో గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ కూడా ఉన్నారు. అంబులెన్స్‌లు, ఫైరింజిన్లు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బిఎస్ఎఫ్ సిబ్బంది సిబ్బంది సహాయకచర్యల్లో పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. 2కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు గుజరాత్ కు బయల్దేరారు. ప్రమాదంపై గుజరాత్ సిఎంకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఫోన్ చేసి ఆరా తీశారు. విమానంలో మాజీ సిఎం విజయ్ రూపానీ ఉన్నట్లు సమాచారం. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి గురువారం లండన్ బయల్దేరిన ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 విమానం కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో దానిలో 242 మంది ప్రయాణికులు ఉన్నారు. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైంది. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఆ ప్రదేశం నుంచి దట్టమైన నల్లటిపొగ అన్ని వైపులకు వ్యాపించింది. ఫ్లైట్ రాడార్ 24 ప్రకారం విమానం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. ఈ క్రమంలో మధ్యాహ్నం1.39 సమయంలో పూర్తిగా కిందకు దిగిపోయి చెట్టును ఢీకొన్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన విమానం వైడ్‌బాడీ బోయింగ్ 787 డ్రీమ్ లైనర్. దీనిలో 300 మంది ప్రయాణించవచ్చు. ఇది 11 ఏళ్లుగా సేవలు అందిస్తోంది. సుదూర ప్రయాణం కావడంతో విమానంలో ఇంధనం కూడా భారీగా ఉండటంతో.. ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. విమాన కూలిన విషయం తెలియగానే ఫైర్ ఇంజిన్లు ఆ ప్రాంతానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఆ విమానంలో ఉన్నట్లు ఏబీపీ పత్రిక పేర్కొంది. ఈ ప్రమాదం విషయం తెలియడంతో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఘటనా స్థలానికి బయల్దేరారు. కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితి తెలుసుకొన్నారు. ఈ ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) స్పందించింది. విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్ వ్యవహరించినట్లు పేర్కొంది. సుమిత్‌కు ఎల్‌టీసీగా 8,200 గంటలు, కోపైలెట్‌కు 1,100 గంటల అనుభవం ఉన్నట్లు వెల్లడించింది. ఏటీసీ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ విమానం రన్‌వే 23 నుంచి గాల్లోకి ఎగిరినట్లు తెలిపింది. కొద్ది సేపటికే ఆ ఎయిర్ క్రాఫ్ట్ నుంచి ఏటీసీకి మేడేకాల్ (అత్యవసర కాల్) వచ్చిందని వెల్లడించింది. ఆ తర్వాత కూలిపోయినట్లు పేర్కొంది. ఈ ప్రమాదంపై సమాచారం కోసం హాట్‌లైన్ నెంబర్ 1800 5691 444 ఏర్పాటు-చేసినట్లు- తెలిపింది. తమ సామాజిక మాధ్యమం, ఎయిర్‌ఇండియా వెబ్‌సైట్‌లో కూడా ప్రమాద వివరాలు, అప్‌డేట్లు- ఉంటాయని పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే తదుపరి ప్రకటన వెలువడే వరకు అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ఫ్లైట్ ఆపరేషన్స్‌ను సస్పెండ్ చేశారు.

# కెసిఆర్, కిషన్ రెడ్డి ఎప్పటికీ ఒక్కటి కాదు

- బిజెపి,రేవంత్ రెడ్డి మాత్రమే ఒక్కటే
- మోడీ ప్రాపకం కోసం రేవంత్ తంటాలు
- ఢిల్లీలో రాహుల్ అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** గల్లీలో గలీజ్ దందాలు చేస్తూ ఢిల్లీలో గులాం గురి చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తీరు ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చిట్ చాట్ చేశారు. మంత్రుల శాఖల కేటాయింపు కోసం, కాంగ్రెస్ పార్టీ అధినేతల అపాయింట్‌మెంట్ కోసం రెండు రోజులు ఢిల్లీలో పడిగాపులు కాసి అపాయింట్‌మెంట్ దొరకని ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నాడు. కేసీఆర్, కిషన్ రెడ్డి ఒక్కటే అని రేవంత్ రెడ్డి అన్న మాట అబద్ధం, అవాస్తవం. రేవంత్ రెడ్డి బీజేపీ ఒక్కటి అన్నది వాస్తవం. రేవంత్ రెడ్డి ,బీజేపీ దోస్తాన్ చాలా సార్లు బయట పడింది. లోక్‌సభ ఎన్నికల్లో బలహీన అభ్యర్థులను పెట్టి బీజేపీ ఎంపీలు గెలవడానికి రేవంత్ రెడ్డి సహాయ పడ్డారు. స్వయంగా ఈ మాట బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరిలో ఈటల రాజేందర్‌ను గెలిపించడానికి వేరే ప్రాంతం నుంచి సునీతా మహేందర్ రెడ్డిని నిలబెట్టారు. కిషన్ రెడ్డిని గెలిపించడానికి బీఆర్ఎస్‌లో ఉన్న దానం నాగేందర్‌ని సికింద్రాబాద్‌లో నిలబెట్టారు. కాంగ్రెస్ నుండి గతంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా పలుమార్లు పోటీ- చేసిన అనుభవం ఉన్న జీవన్ రెడ్డికి కాదని ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేని వెలిచాల రాజేందర్‌కు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌పై పోటీకి నిలిపారు. ఇలా నిజమాబాద్‌లో అరవింద్‌పై, మెదక్‌లో రఘునందన్‌పై, ఆదిలాబాద్‌లో నగేశ్‌లపై రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బలహీన అభ్యర్థులను నిలబెట్టారు. 8 మంది బీజేపీ ఎంపీలలో 7 మందిని రేవంత్ రెడ్డినే గెలిపించారు. బీజేపీ పార్టీ కూడా రేవంత్ రెడ్డిపై ఈగ వాలనివ్వడం లేదు అని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తు చేశారు.స్వయంగా ప్రధాని మంత్రి మోదీ ఎలక్షన్ ప్రచారంలో తెలంగాణలో ఆర్ ఆర్ ట్యాక్స్ నడుస్తుంది అని మాట్లాడిన ఈడి, సీబీఐ ఎందుకు రావడం లేదు..? ఓటుకు నోటు కేసు ఎటుపోయింది, ఎందుకు జాప్యం జరుగుతోంది..? రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయినప్పుడు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకదు కానీ ప్రధానిని కలవడానికి 15 నిమిషాల్లో అపాయింట్ మెంట్ ఎలా దొరుకుతుంది..? బండి సంజయ్ బహిరంగంగానే రేవంత్ రెడ్డి పదవి కాపాడుకోవాలని సూచనలు ఇస్తున్నాడు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా బొంద పెట్టడానికి కాంగ్రెస్, బిజెపి కలిసి పని చేయాలి అని బండి సంజయ్ అన్నారు. బీజేపీ కాంగ్రెస్ ఒక్కటే అనే సంకేతం బండి సంజయ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి బీజేపీలో జాయిన్ అయితే స్వాగతిస్తామని ఎంపీ అరవింద్ అంటు-న్నారు. ఇది రేవంత్ రెడ్డి, బీజేపీ దోస్తానకు సంకేతము కాదా..? నేను బీజేపీ స్కూల్‌లో చదువుకున్న అని రేవంత్ రెడ్డి ఢిల్లీలో అన్నారు. హైదరాబాద్‌లో అన్నది మోదీ విన్నాడో లేదో అని మళ్ళీ అవే మాటలు ఢిల్లీలో మాట్లాడిండు. బీజేపీలోకి వెళ్తాను అని సూచన ఇస్తున్నట్టు-న్నాడు. కాంగ్రెస్ పార్టీ వాళ్ళు రేవంత్ రెడ్డిని నమ్మకండి.. కాంగ్రెస్ పార్టీని ఖతం చేసి బీజేపీలోకి పోతారు అని ప్రశాంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తెలంగాణకు ఆత్మ. తెలంగాణ కోసం కేసీఆర్ పోరాడుతున్న సందర్భంలో ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు. ఏపీకి చంద్రబాబు నీళ్లు తీసుకెళ్తుంటే నోరు ముసుకున్న రేవంత్ రెడ్డి తెలంగాణ శత్రువు. కేసీఆర్ హయాంలో తలసరి ఆదాయంలో దేశంలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 4వ ప్లేస్‌కు, జీడీపీలో 4వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని 13వ స్థానానికి దిగజార్చిన నువ్వు తెలంగాణ శత్రువు. తెలంగాణ అప్పుల పాలైందని, తెలంగాణ ముఖ్యమంత్రిగా వెళ్తే దొంగలా చూస్తున్నారని తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు అని ప్రశాంత్



రెడ్డి ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణకి అన్యాయం చేస్తున్నారు. 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి తెలంగాణకు ఒక్క రూపాయి తీసుకురాలే. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న టీ-డీపీ ఎంపీలు వేల కోట్లు- నిధులు తెచ్చుకున్నారు. నిధుల వరద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుపోతున్నారు. పోలవరం, అమరావతి రాజధాని, విశాఖ స్టీల్ ఎ÷-లాంట్‌కు వేల కోట్లు-, బనకచర్లకు జాతీయ హోదా తెస్తుంటే మన కాంగ్రెస్, బిజెపి ఎంపీలు ఒక్క రూపాయి కూడా తెలంగాణకు తేవట్లేదు. కాబట్టి తెలంగాణకి అసలైన శత్రువులు బీజేపీ కాంగ్రెస్ పార్టీలే..? బీఆరెస్ పార్టీకి, కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం.. బీఆర్ఎస్ ఎంపీలు గెలిచి ఉంటే తెలంగాణకు ఈ గతి పట్టేదా. 45 సార్లు ఢిల్లీకి పోతే 4 సార్లు కూడా రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ దొరకలేదు. తెలంగాణ ముఖ్యమంత్రి బతుకు అలా ఉంది అని ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- 36 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్
- ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నవీన్ మిట్టల్
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా హరిచందన దాసరి

**హైదరాబాద్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. 36 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌ను నియమించింది. గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నవీన్ మిట్టల్‌ను బదిలీ చేసింది. ఇక ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాష్‌ను నియమించింది. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా శశాంక్ గోయల్‌ను బదిలీ చేసింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా లోకేష్ కుమార్‌ను నియమించింది. ఆయనకు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) చీఫ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా హరిచందన దాసరిని నియమించింది. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఎండీగా జె.శంకరయ్యను నియమించింది. తెలంగాణ భవన్ ముఖ్య కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్ బదిలీ చేసింది. సమాచార కమిషన్ సెక్రటరీగా భారతీ లకపతినాయక్‌ను నియమించింది. హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరీష్, నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా టి.వినయ్ కృష్ణారెడ్డిని బదిలీ చేసింది. రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రటరీగా రాజీవ్‌గాంధీ హనుమంతును నియమించింది. స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఈ నవీన్ నికోలస్‌ను బదిలీ చేసింది. ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌గా కె. శివకుమార్ నాయుడును నియమించింది. ఇక సాధారణ పరిపాలన శాఖ సంయుక్త కార్యదర్శిగా చిట్టెం లక్ష్మిని బదిలీ చేసింది. జి. సృజనకి మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. వ్యవసాయ, సహకారశాఖ సంయుక్త కార్యదర్శిగా ఎల్. శివశంకర్‌ను నియమించింది.




# హైటెక్స్ వేదికగా గద్దర్ అవార్డులు: దిల్‌రాజు



**హైదరాబాద్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరా బాద్‌లోని హైటెక్స్ వేదికగా ఈ అవార్డుల కార్యక్రమం జరగనుందని నిర్మాత దిల్‌రాజు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అందించనున్న గద్దర్ పురస్కారాలపై ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మీడియాకు వెల్లడించారు. అహ్మదాబాద్‌లో చోటు-చేసుకున్న విమాన ప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు హాజరు కాలేకపోయారని తెలిపారు. ఆ విషాదరకర ఘటనపై మౌనం పాటిస్తూ సంతాపం తెలిపారు. అనంతరం, అవార్డుల వివరాలు వెల్లడించారు 14 ఏళ్ల తర్వాత జరగనున్న అవార్డుల వేడుకను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎఫ్‌డీసీతోపాటు- ఇండస్ట్రీకి ఉంది. ఈ నెల 14న సాయంత్రం 6 గంటలకు వేడుక ప్రారంభమవుతుంది. సమాచారశాఖ ద్వారా ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సినీ అభిమానులకు చేరువవ్వాలని కోరుకుంటున్నాం. 2014 నుంచి 2023 వరకు.. బెస్ట్ ఫిల్మ్ (ఏడాదికి మూడు చొప్పు)కు సంబంధించిన హీరో, హీరోయిన్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌లు అవార్డులు అందుకుంటారు. ఉత్తమ చిత్రాలకుగానూ ఇలా నలుగురికి పురస్కారాలు ఇవ్వనుండడం తొలిసారి. అందరూ హాజరై, విజయవంతం చేయాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు.

# క్వారీ గుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

- తల్లిదండ్రుల కన్నీరు మున్నీరు

**మేడ్చెల్,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):**మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పరిధిలోని అరుంధతి నగర్ లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. మృతి చెందిన చిన్నారులు దుర్గా ప్రసాద్ (11), సుబ్రహ్మణ్యం(8)గా గుర్తించారు పోలీసులు. చిన్నారులు అరుంధతి నగర్ లో వుండే బంధువుల ఇంటికి వచ్చారు. నిన్న మధ్యాహ్నం ఇంటి నుంచి ఆడుకునేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి శవాలుగా తేలడంతో తీవ్ర విషాదం చోటు-చేసుకుంది. అయితే చిన్నారుల కోసం కుటు-ంబ సభ్యులు వెతకగా ఆచూకీ లభించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చిన్నారుల కోసం వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో క్వారీ గుంతవైపు వెళ్లిన కొందరు వ్యక్తులు చిన్నారుల మృతదేహాలు నీటిలో తేలియాడడం చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు చిన్నారులు క్వారి గుంతలో శవాలుగా తేలడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు కుటుంబ సభ్యులు.



## సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో స్వర్గీయ డాక్టర్ సి. నారాయణ రెడ్డి ఘనంగా వర్ధంతి వేడుకలు...

**రాజన్న సిరిసిల్ల జిల్లా,జూన్12(పీసీడబ్ల్యూ న్యూస్):** సిరిసిల్ల తెలంగాణ భవన్ స్వర్గీయ డా. సి. నారాయణరెడ్డి ఘనంగా వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు శ్రీ తోట ఆగన్న, మాజీ పవర్ లూమ్స్ టెక్స్టైల్ డెవలప్మెంట్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్ గారు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్లు కుంబాల మల్లారెడ్డి దార్ల సందీప్ పూర్ణ చందర్ రాపెల్లి దినేష్ మాజీ సర్పంచ్ వేణుగోపాల్ రావు ఎదురుగట్ల చంద్రయ్య కంచర్ల రవి గౌడ్ దొనుకుల కళ్యాణ్ పాల్గొన్నారు.

## కాకి వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శ

**- టియుడబ్ల్యూజే (ఐజేయు) దాడుల నియంత్రణ కమిటీ జిల్లా కో- కన్వీనర్ బేతమల్ల సహదేవ్**



**కురవి జూన్,12(పి.సి.డబ్ల్యూ న్యూస్):**మండలంలో జర్నలిస్ట్ కాకి వెంకట్ రెడ్డి తండ్రి ( సత్తిరెడ్డి ) ఇటీవల కాలంలో మరణించగా కొరవి,సీరోల్ మండలం జర్నలిస్టులు టియుడబ్ల్యూజే (ఐజేయు) దాడుల నియంత్రణ కమిటీ జిల్లా కో-కన్వీనర్ బేతమల్ల సహదేవ్,సీరోలు మండల ప్రధాన కార్యదర్శి మడ్డి వీరన్న,కురవి మండల ఉపాధ్యక్షులు గండమల్ల రోశయ్య, సంఘం సభ్యులు పొన్నబోయిన వెంకన్న, కమటం నాగేశ్వరరావు,పిడమర్తి ఉపేందర్, నవీన్ లు కాకి వెంకట్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ప్రగడ సానుభూతి తెలిపారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

**- జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి**



**కురవి జూన్ 12(పి.సి.డబ్ల్యూ న్యూస్):**మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రవీందర్ రెడ్డి కురవి ఉన్నత పాఠశాలను సందర్శించి ఈరోజు హాజరైన విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యా సంవత్సరం ఆరంభం రోజునుండే పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై బాగా చదువుకుని భావి భారత పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ వహీద్ , జిల్లా సైన్స్ అధికారి అప్పారావు రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటరాం నరసయ్య, ఉపాధ్యాయులు శ్రీధర్ విజయ్ రాజ్, వెంకన్న ,వెంకటేశ్వర్లు, నరసింహ చారి, ప్రేమ సాగర్, రవీందర్ ,బాలాజీ ,లక్ష్మయ్య ,విజయలక్ష్మి ,శ్యామల దేవి ,యాకమ్మ మల్లికార్జున్ రావు, రాజు , యాకమ్మ, రత్నమాల, పద్మలత మొదటి వారు పాల్గొన్నారు.

## భూ భారతి సదస్సులు సద్వినియోగం చేసుకోండి

**- బయ్యారం తహశీల్దార్ నాగరాజు**

**బయ్యారం, జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బయ్యారం తహశీల్దార్ నాగరాజు అన్నారు.బయ్యారం మండల కేంద్రంలో,దర్మాపురం రెవిన్యూ పరిధిలో గురువారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించిన ఆయన రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం రైతుల నుండి బయ్యారం రెవిన్యూ పరిధిలో 116,ధర్మాపురం 103 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.ఈ సదస్సు లలో రైతులు,రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్,ఆర్ఐ,జూనియర్ అసిస్టెంట్,రికార్డ్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## బహుజనవాది డాక్టర్ వివేక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు

**● శాలువాతో సన్మానించిన టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్**



**కురవి, జూన్ 12(పి.సి.డబ్ల్యూ న్యూస్):** కిసాన్ పరివార్ సిఈఓ డాక్టర్ వివేక్ జన్మదినం సందర్భంగా కురవిలో జరిగిన కార్యక్రమంలో జర్నలిస్ట్ లు ఆయనను శాలువాతో సత్కరించారు.ఈసందర్భంగా టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా జర్నలిస్ట్ లకు ఏ ఆపదవచ్చిన నేనున్నానని ధైర్యం చెపుతూ అనారోగ్యానికి, ప్రమాదాలకు గురైన జర్నలిస్ట్ లకు ఆర్థికసహాయం చేస్తున్న డాక్టర్ వివేక్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు.డోర్నకల్ మండలానికి చెందిన నాగరాజు, మహబూబాబాద్ మండలానికి చెందిన గోపి అనే జర్నలిస్ట్ లు కూడా ఇటీవల జరిగిన వేరు,వేరు ప్రమాదాల్లో గాయపడి కోలుకుంటున్నారని, జర్నలిస్ట్ కుటుంబాలకు కూడా డాక్టర్ వివేక్ పెద్దమనసుతో సహాయం చేయాలని ఈ సందర్భంగా శ్రీనివాస్ కోరారు.జర్నలిస్ట్ ల పట్ల ఇదేవిధమైన స్నేహపూరిత వైఖరి కొనసాగించాలని శ్రీనివాస్ అన్నారు.కిసాన్ పరివార్ సిఈఓ డాక్టర్ వివేక్ మాట్లాడుతూ. మహబూబాబాద్ జిల్లా ప్రజలు తనమీద చూపుతున్న అభిమానానికి, ప్రేమకు నేనెప్పుడూ రుణపడి ఉంటానని, సేవే మార్గంగా సమాజహితమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. జర్నలిస్ట్ ల సమస్యలు, పరిస్థితులు తనకు తెలుసునని, తమ కుటుంబం కంటే ఎక్కువగా సమాజం గురించి ఆలోచించే జర్నలిస్ట్ సోదరులకు వెన్నుదన్నుగా ఉంటానని, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లందరూ మీ..ఆశీస్సులు, అండదండలు, అభిమానం నాకు అందించాలని డాక్టర్ వివేక్ కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు, బాధ్యులు, జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## విహార యాత్రలు పుణ్యక్షేత్రాల ప్రత్యేక టూర్ ప్యాకేజి పోస్టర్ ఆవిష్కరన

**● డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ**



**నర్సంపేట,జూన్ 12, (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో యందు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విహార యాత్రలు మరియు పుణ్యక్షేత్రాల ప్రత్యేక (టూర్) ప్యాకేజ్ నర్సంపేట నుండి అన్ని యాత్రలకు బస్సులు బయలుదేరును.1. పంచరామాలుఅమరావతి (అమరేశ్వరాలయం) భీమవరం (సోమేశ్వరాలయం) పాలకొల్లు (క్షీరరామలింగేశ్వరాలయం) దాక్షారామం (భీమేశ్వరాలయం) సామర్లకోట (కుమార రామ భీమేశ్వరాలయం) మరియు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం.2 రోజులు ఒక్కరికీ- రూ 2300/- సూపర్ లగ్జరీ సా 06:00 గం.లకు ఈ నెల 27న నర్సంపేట నుండి బయలుదేరుతుంది. వివరాలకు 9959226052, 9989038476, 9704644543,7013000630 నంబర్లను సంప్రదించి ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఆమె కోరారు.

## బీఆర్ఎస్‌కు షాక్

**● కాంగ్రెస్‌లోకి జమ్మికుంట, కమలాపూర్ నేతలు**

**● ప్రణవ్ సంచలన ఆరోపణలు!**



**హుజురాబాద్,జూన్ 12(పి.సి.డబ్ల్యూ న్యూస్):**హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో జమ్మికుంట, కమలాపూర్ మండలాలకు చెందిన వంద మందికి పైగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.జమ్మికుంట మండలం, కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీతో పాటు పలువురు నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువాలు కప్పి వారిని ప్రణవ్ సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, ప్రణవ్ ఆలోచనలకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నట్లు నూతనంగా చేరిన నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణకు కేసీఆర్ హాజరుకావాల్సి వస్తే కేటీఆర్ ఎందుకు ఆందోళన చెందుతున్నారని ప్రశ్నించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత గతంలో చెప్పిన దయ్యాల్లో కౌశిక్ రెడ్డి ఒకరని ప్రణవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "రీల్స్ చేయడం మానేసి రియల్ లైఫ్‌లోకి రావాలని, నియోజకవర్గ సమస్యలు గాలికి వదిలేసి బ్లాక్ మెయిల్, చిల్లర రాజకీయాలు మానేయాలని" కౌశిక్ రెడ్డికి హితవు పలికారు. కౌశిక్ రెడ్డి చుట్టూ తిరిగే నాయకులే తమతో టచ్‌లో ఉన్నారని, త్వరలో బీఆర్ఎస్ నుండి మరిన్ని చేరికలు ఉంటాయని ప్రణవ్ వెల్లడించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ప్రణవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకోసారి ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులను తిరగనియ్యమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట, కమలాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## చర్లగడ్డ ఎర్రగుట్ట తండకు రోడ్లు వేయాలని రైతుల ధర్నా

**● సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరి నాగేశ్వరరావు**




**కురవి, జూన్ 12(పి.సి.డబ్ల్యూ న్యూస్):** బలపాల భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో బలపాల చెరువు కింద రెండు చర్ల గడ్డ, ఎర్రగుట్ట తండకు సంబంధించిన రోడ్లు వేయాలని రైతులందరినీ సమీకరించి ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల వరి పొలాలకు పోవడానికి రోడ్డు గురించి గత ప్రభుత్వ అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మంత్రి సత్యవతి రాథోడ్ కు ఈ రోడ్డును సర్వే చేయించి అనేకసార్లు కలెక్టర్ కు కూడా వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది కానీ ఈ రోడ్డు గురించి ప్రజా ప్రతినిధులు గాని అధికారులు గానీ పట్టించుకునే నాధుడే లేక ఈ రోడ్డు కింద ఉన్న పేద రైతులు మరియు హరిజన గిరిజన సంబంధించిన పొలాలు ఉన్నాయి ఈ రోడ్డు సౌకర్యం లేకపోవడం వలన దున్నడానికి ట్రాక్టర్లు మందు కట్టలు వ్యవసాయ కూలీలు నడవడానికి దారిలేని పరిస్థితి ఏర్పడినది రోడ్డు లేకపోవడం పొలాలలో పిచ్చి చెట్లు కంప మొదలుకొని బీడు భూములుగా మారుతున్నాయి చెరువు నిండా నీళ్లు ఉంచుకొని పొలాలు నాట్లు వేయలేని పరిస్థితి ఏర్పడినది కానీ ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వము కూడా ఎన్నికల ముందు బలపాల రెండుచర్ల గడ్డకు రోడ్లు వేస్తామని ఇప్పుడున్న ఎమ్మెల్యే రామచంద్రనాయక్ వాగ్దానం చేసినారు మేము ఎప్పుడు అడిగినా శాంక్షన్ అయినది శంకుస్థాపన చేస్తామని మాటలతోనే కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు ముందుకు వచ్చి యుద్ధ ప్రాతిపదికన రోడ్లు వేయాలని లేని పక్షంలో దశలవారీగా రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని వారు అన్నారు సిపిఐ గ్రామ కార్యదర్శి రామా గాని రవి సిపిఐ సీనియర్ నాయకులు కన్నూజ్ వెంకటనారాయణ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు వేపాకుల పాపయ్య షేక్ రాజ మహ్మద్ బలపాల రైతులు నారపాటి సైదులు సంతు తిరపయ్య నెల్లూరు వెంకటేశ్వర్లు కుక్కల వెంకన్న నల్లబోతు దశరథ దేవలపల్లి బిక్షమయ్య బుర్ర లింగయ్య తిరపయ్య కన్నూజ్ నవీన్ అల్లాడి నాగేశ్వరరావు వీరన్న ఆకునూరి నాగేష్ ఉపేందర్ మేళ్లచెరువు దేవులు తదితర రైతులకు పాల్గొన్నారు.

## ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు...




**కరీంనగర్,జూన్12(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గంజ్) లో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఇట్టి న్యాయ విజ్ఞాన సదస్సులో విద్యార్థులకు బాల కార్మికుల నిర్మూలన కోసం ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు, తప్పు చేసిన నిజాయితీగా ఉండాలనీ, విద్యార్థులు చదువు పై శ్రద్ధ వహించాలని, చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఎలాంటి చట్ట పరమైన సమస్యలు ఉన్నా కూడా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, పాఠశాల ఉపాద్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదేళ్ల నిరీక్షణకు తెర

**● కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఆసరా: హుజురాబాద్, జమ్మికుంటలో**

**● ప్రణవ్ చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు**

**హుజూరాబాద్,జూన్12(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్, జమ్మికుంట,అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ పేర్కొన్నారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగిందని, ఇది లబ్ధిదారులలో సంతోషాన్ని నింపిందని ఆయన అన్నారు.హుజురాబాద్ మండలం సింగాపూర్, జూపాక గ్రామాల్లోని 20 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రణవ్ పట్టాలను అందజేశారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులు స్వీట్లు పంచుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, మంత్రులకు, నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఇళ్లు, రేషన్ కార్డులు కావాలని ప్రజల నుండి డిమాండ్లు వచ్చినా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారులను గుర్తించి, రాజకీయాలకు అతీతంగా ఇళ్లు అందిస్తోందని ఆయన స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇళ్లు రాని వారు ఎవరూ అధైర్యపడొద్దని, రాబోయే మూడు నెలల్లో మరో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **జమ్మికుంట మున్సిపల్ పరిధిలో..**జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట 14వ వార్డులో కూడా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రణవ్ పట్టాలను అందజేశారు. ప్రభుత్వం సూచించిన నియమాలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన ప్రజలకు సూచించారు. జమ్మికుంట మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టియుసిఐ రాష్ట్ర ప్రధమ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ...

**● భవిష్యత్తు పోరాటాల రూపకల్పన కోసమే మహాసభలు ● జయప్రదం చేయాలని టియుసిఐ పెద్దపెల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తోకల రమేష్, ఈసంపల్లి రాజేందర్ పిలుపు.**




**గోదావరిఖని,జూన్12(పీసీడబ్ల్యూ న్యూస్):** జూన్12, గురువారం రోజున 8వ కాలనీలో టియుసిఐ జిల్లా కార్యవర్గ సమావేశం ఈ సమావేశంలో టి యు సి ఐ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) రాష్ట్ర ప్రధమమహాసభ జూన్ 21 22 తేదీలో నిజామాబాదు లో జరుగుతున్నాయి ఈ సభలను జయప్రదం చేయాలని టి యు సి ఐ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు తోకల రమేష్, కార్యదర్శి ఈసపెల్లి రాజేందర్, పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది అనంతరము టి యు సి ఐ, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడి తోకల రమేష్, కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు కార్మికుల శ్రమను గుర్తిస్తూ, వారికి పనికి తగ్గ వేతనం, సమాజంలో గౌరవం ఇస్తున్నాయి. కానీ మనదేశంలో కార్మికుల శ్రమకు గుర్తింపు లేకపోగా అడుగడుగునా అవమానాలే. శ్రమకు తగ్గ ఫలితం అటుంచి, కనీస వేతనాల ఊసు కూడా లేదు. ముఖ్యంగా గత 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు మరింత దిగజారాయి. బీజేపీ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నది. కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకోలేదు. పైగా వున్న ఉద్యోగాలను తొలగిస్తున్నది. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్నది. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రతను దూరం చేస్తున్నది. కార్మికుల హక్కులను అడుగడుగునా కాలరాస్తున్నది. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించివేస్తున్నది. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగానే దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను తెచ్చి అమలు చేయాలని చూస్తున్నది. కార్మికుల 8, గంటల పని విధానం రద్దుచేసి, 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చి, కార్మికులతో వెట్టిచాకిరి చేయించే కుట్రలు చేస్తున్నది. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో యదేచ్ఛగా అమలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత కేసిఆర్ ప్రభుత్వం, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం అటు ఇటుగా కేంద్ర ప్రభుత్వ వైఖరినే అవలంబిస్తున్నాయి. కార్మికుల శ్రేయస్సును పట్టించుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాల్సిన బాధ్యత ప్రధానంగా కార్మికవర్గం పైనే ఉన్నది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో, ముఖ్యంగా మన జిల్లాలో సింగరేణి NTPC,RFCL మున్సిపల్, గ్రామపంచాయతీ కేజీబీవీ, మోడల్ స్కూల్, మిషన్ భగీరథ, భవన నిర్మాణ, ఆటో మోటార్ మరియు ఇతర రంగాలు కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం, వేతనాల పెంపు, ఉద్యోగ ఆరోగ్య భద్రత కోసం కార్మిక వర్గం రాజీలేని పోరాటాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి యు సి ఐ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు పుల్లూరి నాగభూషణం, గొల్లపల్లి చంద్రయ్య, ఆడెపు శంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కలువలరాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్ర పథకాలే ఆధారం.

**● కేంద్ర మోదీ పథకాలతో లక్షల మందికి లబ్ధి**
**● పది పథకాలతో రాష్ట్రంలో బీజేపీ ముద్ర**
**● టీఆర్ఎస్ - కాంగ్రెస్‌లకు అభివృద్ధిపై మాట్లాడే హక్కు లేదు ● మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబన్న**
**● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు**




**ఖమ్మం, జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** గత పదకొండు సంవత్సరాలలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పోషించిన పాత్ర అపూర్వమని, రాష్ట్రాన్ని ముందుకు నడిపిన ప్రతి ఘట్టానికీ కేంద్ర పథకాలే ఆధారం అన్న విషయాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబన్న , ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టంగా పేర్కొన్నారు. గురువారం ఖమ్మం లో మీడియాతో మాట్లాడిన వారు , కేంద్ర ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న పథకాలు లక్షలాది మందికి నేరుగా లబ్ధిని అందించాయని తెలిపారు. రాష్ట్రంలోని టీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో స్పష్టమైన అభివృద్ధి కనిపించలేదని విమర్శించారు.పీఎం కిసాన్ సన్మాన్ నిధి పథకం ద్వారా రాష్ట్రంలోని 31 లక్షల 30 వేల అర్హులైన రైతుల్లో 31 లక్షల 20 వేల మందికి నిధులు బదిలీ చేయబడినట్లు పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 99 శాతం నిధుల బదిలీ విజయవంతంగా జరిగిందన్నారు. ఇదే విధంగా, పీఎం ముద్రా యోజన ద్వారా 2017 నుంచి 2024 వరకు 75 లక్షల రుణ ఖాతాలు మంజూరై, 72 వేల కోట్ల విలువైన రుణాలు మంజూరు చేయబడ్డాయి. ఈ పథకాలు గ్రామీణ యువతలో స్వావలంబనకు బీజం వేశాయని అభిప్రాయపడ్డారు.పీఎం జనధన్ యోజన కింద రాష్ట్రంలో 1.27 కోట్ల లబ్ధిదారులకు రూ.517 కోట్ల నిధులు ఖాతాల్లో ఉన్నాయి. పీఎం స్వనిధి పథకం ద్వారా నాలుగు లక్షల మందికి 1247 కోట్లు మంజూరవగా, ఇందులో 1226 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయని వెల్లడించారు. పట్టణ గిరిజన, అణగారిన వర్గాల వాసులకు, వీధివిక్రేతలకు ఇది ఆశాజ్యోతి లాంటిదని కొనియాడారు.పీఎం ఆవాస్ యోజన (పట్టణం) ద్వారా ఇప్పటివరకు 3.6 లక్షల ఇళ్లకు మంజూరుతోపాటు, 2.4 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభమై 2.2 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. దీనికోసం కేంద్రం రూ.6150 కోట్లు మంజూరు చేసి, ఇప్పటివరకు 3800 కోట్లు విడుదల చేసినట్టు వివరించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద 14331 కిలోమీటర్ల రహదారులకు మంజూరుగా 12,800 కిలోమీటర్లకు పైగా ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. అలాగే 551 వంతెనలలో 383 నిర్మాణం పూర్తయింది. ఈ పథకంపై కేంద్రం రూ.4948 కోట్లను వ్యయం చేసినట్టు తెలిపారు.ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కింద ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 82 లక్షల 59 వేల 718 ఆరోగ్య కార్డులు జారీ చేయబడ్డాయి. కేవలం గత 30 రోజుల్లోనే 6,268 కార్డులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అంతేకాక, జాతీయ రహదారుల విస్తరణలోనూ కేంద్రం తెలంగాణపై దృష్టిసారించిందని వివరించారు. 2019 నుండి 2025 వరకు రాష్ట్రంలో 1488 కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించబడి, వాటిపై మొత్తం 19,000 కోట్లకు పైగా వ్యయం జరిగినట్టు వివరించారు.ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద మార్చి 2025 వరకు మొత్తం 11 లక్షల 84 వేల 203 గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. గిరిజన, పేద మహిళలకు ఈ పథకం గృహోత్సాహాన్ని కలిగించిందని వ్యాఖ్యానించారు. ఇక, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద, అంత్యోదయ అన్న పథకం ద్వారా రాష్ట్రంలో 5 లక్షల 67 వేల కుటుంబాలకు, మొత్తం 1.90 కోట్ల మందికి అన్నధాన పథకం ద్వారా నిత్యావసర సరుకులు అందించబడ్డాయి.నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్న విధంగా, రాష్ట్రంలో టీఆర్ఎస్ పాలన గడిచిన 10 ఏళ్లలోనూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనూ ప్రజలకు మేలు జరిగినట్లు కనిపించడంలేదని విమర్శించారు. అభివృద్ధి కేవలం కేంద్ర పథకాలతోనే సాధ్యమైందని, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని సక్రమంగా అమలు చేయడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు గోంగూర వెంకటేశ్వరరావు, నున్న రవికుమార్, అల్లిక అంజయ్య, గంట్యాల విద్యాసాగర్, ఉప్పల శారద, వాకదాని పుల్లారావు, గుత్తా వెంకటేశ్వర్లు, అత్తి విజయ రెడ్డి, రవి రాథోడ్, తిరుమల పల్లి విజయరాజు, కోటమర్తి సుదర్శన్, గుగులోతు నాగేశ్వరరావు,భూక్య శ్యాంసుందర్, బోయినపల్లి చంద్రశేఖర్, ఈదుల వీరభద్రం హాజరయ్యారు.

# అంగన్వాడీల్లో ‘అమ్మ మాట”





**పరకాల, జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ పరకాల ప్రాజెక్ట్ , నాగారం సెక్టార్, పరకాల మండలం, పోచారం గ్రామంలో,ప్రీ స్కూల్ చిన్నారులకు అక్షరాభ్యాసం,అంగన్వాడి కేంద్రం లో పోషణ వాటిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల ఆర్డిఓ నారాయణ, పరకాల ఎంపీడీవో ఆంజనేయులు, ఎమ్మార్వో విజయలక్ష్మి మేడం, నాగారం సెక్టార్ సూపర్వైజర్ రాణి,పోచారం యుపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీష్ సార్ హాజరై మూడు సంవత్సరముల చిన్నారులకి అక్షరాభ్యాసం చేయించటం జరిగింది, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్డిఓ మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రాలను ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా చిన్నారులకు ఆకర్షించే విధంగా సౌకర్యవంతంగా, సురక్షితంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని చిన్నారులకు ఆటపాటలతో విద్యా నేర్పుతూ, పోషకాహారం అందించటం జరుగుతుందని అంగన్వాడిలా నుండి అందించే సేవలను అందరూ సద్వినియోగం చేసుకొని చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటానికి విద్య బుద్దులు నేర్పించడానికి అమ్మ ఒడి తర్వాత అంగన్వాడి లోనే నేర్పించటం జరుగుతుంది కాబట్టి ప్రజలందరూ 3 నుండి 5 సంవత్సరాల చిన్నారులను అంగన్వాడి కేంద్రానికి పంపించాలని పిలుపునిచ్చారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకి అందించే భోజనములో అదనపు పోషకాహారం పొందే ఉద్దేశంతో మునిగ, కరివేపాకు, జమ , బొప్పాయి, ఉసిరి, చెట్లను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోచారం పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్, భాగ్యలక్ష్మి, మంజుల, శాంత, కారోబార్ సంతోష్ కుమార్, అంగన్వాడి హెల్పర్స్, ALMSC కమిటీ సభ్యులు, చిన్నారుల తల్లితండ్రులు , కుటుంబ సభ్యులు హాజరు కావటం జరిగింది.

# అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన ఎమ్‌డిఆర్ ఫౌండేషన్

**● అన్ని తానైన ఎమ్‌డిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మధు**
**● ఎమ్‌డిఆర్ ఫౌండేషన్ చైర్మన్ దేవేందర్ రాజే తనకు స్ఫూర్తి అంటున్న మధు**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ కాలనీలో రెండు రోజులుగా పడివున్న ఓ వ్యక్తిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో, చనిపోయిన వ్యక్తి బిక్షాటన చేస్తూ జీవించేవాడిగా గుర్తించారు. వెంటనే అతడిని స్థానిక పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ పోస్ట్‌మార్టం అనంతరం అతనికి అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్ డి ఆర్ ఫౌండేషన్ కార్యాలయాన్ని సంప్రదించగా, ఫౌండేషన్ అధ్యక్షులు మధు ఆధ్వర్యంలో చనిపోయిన వ్యక్తికి అంత్యక్రియలు నిర్వహించారు. ఎన్నో అనాధ శవాలకు నిరంతరం అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని, అన్నా అంటే నేనున్నా అంటూ పేదలకు, వృద్ధులకు, ఆపన్న హస్తం అందించే ఎమ్ డి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దేవేందర్ రాజు ఆర్థిక సహాయంతో కొనసాగుతుంది అని ఎమ్ డి ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మధు తెలిపారు.







# సీడ్స్, ఫేర్టిలైజర్ షాపులపై విజిలెన్స్ తనిఖీలు

**బయ్యారం,జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలో కొత్తపేట–గంధంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం సీడ్స్, ఫేర్టిలైజర్ షాపులను విజిలెన్స్ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో భాగంగా స్టాక్ రిజిస్టర్,లైసెన్స్ ఇన్‌వాయిస్‌లు ప్రిన్సిపల్స్ సర్టిఫికెట్లు,గోడౌన్లు, విత్తనాలు, ఎరువులు,పురుగు మందులు తదితర రికార్డులను,గోడౌన్ లలో స్టాక్ లను క్షుణ్ణంగా పరిశీలించారు.మండలంలో పలు షాపులలో ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాంజీ,విజిలెన్స్ బృందం సీఐ ఎండీ హస్నన్,సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన తాసిల్దార్ నంగునూరి రమేష్



**ఖానాపూరం జూన్ 12, (పీసీడబ్ల్యూ న్యూస్):** కలెక్టరేట్ వరంగల్ సూపరిడెంట్ గా పనిచేస్తూ నంగునూరి రమేష్ బదిలీ పై గురువారం రోజు ఉదయం ఖానాపూర్ తాహశీల్దార్ గా పదవి బాధ్యతలు చేపట్టారు. బుధరావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధరావుపేట మరియు పోచారం గ్రామాలకు సంబంధించిన రైతు భూ సమస్య పై రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి బదిలీ...




**కరీంనగర్ జిల్లా జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలో భాగంగా ఆమెను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు బదిలీ చేశారు. చాహత్ బాజ్పేయి 2019 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. గత సంవత్సరం ఆగస్టు నెల నుంచి ఆమె కరీంనగర్ కమిషనర్ గా విధులు నిర్వహించి ఇప్పుడు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ గా బదిలీ అయ్యారు.

# అప్పుడు ఇచ్చారు ఇప్పుడు వద్దంటున్నారు?.

**- పాత తహసిల్దారుల మాట చెల్లదా?.**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 12(పిసీడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా కాసిపేట్ మండలం లో ముత్యంపెల్లి గ్రామ పంచాయతి పరిది లో 2019 లో అప్పుడు ఉన్నా తహసిల్దార్ రెండు గుంటల భూమిని పెద్దమ్మ దేవుని గుడి కట్టుకోవడం కోసం యదవ సంఘనికి భూమిని ఇచ్చిన అధికారులు .గ్రామ పంచాయతి లో పెద్దమ్మ దేవుని పేరున తీర్మానాము కూడ సేసినారు. గతంలో ఇచ్చిన ఎమ్మార్వో హామీలు చెల్లవి నేరమని ఇప్పడు వచ్చిన ఎమ్మార్వో భోజన్న గుడికి గోడ కట్టకుండా అడ్డు వస్తున్నారని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గ్రామానికి దేవాలయాలు ఎంతో ప్రాముఖ్యతనిస్తాయని అలాంటి దేవాలయాలకు పరాహరి గోడలు నిర్మించుకోవడం నేరమా అని ప్రశ్నిస్తున్నారు?. ఇప్పుడు ఉన్న తహసిల్దార్ మీరు నాకు ఎందుకు కలువ లేదు అంటూ గుడి సుట్టు గోడ కట్టంకండి అంటూ అడ్డుపడుతున్నారు. ఇదేమి టని గ్రామస్తులు ప్రశ్నించగా పై అధికారుల ఆదేశానుసారమే నేను ఆపడం జరుగుతుందని గ్రామస్తులకు పేర్కొన్నారు.





## ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఘనంగా సన్మానించిన పరకాల ఆర్యవైశ్య సంఘం


**పరకాల, జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల ఎరువులు పురుగుమందులు, విత్తనముల డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన అరుణ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ ప్రొప్రైటర్ గందె వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా నవత బ్రదర్స్ శివాజీని, కోశాధికారి మల్లికార్జున ట్రేడర్స్ ఎర్ర లక్ష్మణ్ లను పరకాల మండల ఆర్యవైశ్య సంఘం తరపున పరకాల అరుణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాప్ ఆవరణలో ఆర్యవైశ్య సంఘ సోదరులు వ్యాపారులు మర్యాద పూర్వకంగా కలిసి వారిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పరకాల ఆర్యవైశ్య సంఘ నాయకులు సూర్యదేవర సదానందం తమ్మిశెట్టి వెంకన్న శ్రీరాం రవీందర్, ఇరుకుల్ల లక్ష్మణ్,ఎర్రం విద్యాసాగర్, దేవ సతీష్, శ్రీమన్నారాయణ, పాత రవీందర్ కొండ్ల విజయ్ ఎల్లంకి సతీష్ పుల్లూరు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేయిట్,కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలి

- టీ.ఎస్.జే.యూ (ఎన్.యూ.జే.ఐ) వినతి
- 50% రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో.



**భూపాలపల్లి, జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్ట్ ల పిల్లలకు 50%శాతం రాయితీ కల్పించాలని గురువారం టీ.ఎస్.జే.యూ.రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్(ఎన్.యూ.జే.ఇండియా) రాష్ట్ర ఆర్గనైజషన్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ ల ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.రాజేందర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన డి.ఈ.ఓ రాజేందర్ జిల్లాలోని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలో జర్నలిస్టు పిల్లలకు 50% ఫీజు రాయితీ కల్పించేలా ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్టుల ఆర్థిక సమస్యలు దృష్టిలో ఉంచుకొని ఫీజు రాయితీ కల్పించిందుకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ పక్షాన జిల్లా కలెక్టర్ కు,జిల్లా విద్యాశాఖ అధికారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీ.ఎస్.జే.యూ జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్,జిల్లా సంయుక్త కార్యదర్శులు కడపా క రవి,బొచ్చు భూపాల్,మీడియా ఇంచార్జ్ కారుకూరి సతీష్,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు మారపాక చంద్రమౌళి,బొల్లపల్లి జగన్ తదితరులు వున్నారు.



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER JAYASHANKAR BHUPALPALLY
Present: Sri.M. Rajender.

Rc.No.Spl/B1/B2/B3/Pvt Schools/2025 Dt:12.06.2025

Sub: School Education JS Bhupalpally Representation of the Journalist unions of JS Bhupalpally for accord permission to their Children to provide for Education in Private/Aided Schools of District Orders - Issued.
Ref: 1. Representation of TS. Journalist Unions (TSJU), JS Bhupalpally, Dt:12.06.2025
2. Instructions of the District Collector, JS Bhupalpally

-oOo-

Whereas, in the reference 1st cited above, the Telangana State Journalists Union, JS Bhupalpally has given a representation duly requesting to provide 50% fee concession to their children studying in private Schools in the district.

In view of the above, after careful examination of the appeal of the Journalist and also as per the instructions of the District Collector, Jayashankar Bhupalpally, the undersigned has directed to all the Correspondent / Secretary of Un-Aided Private Schools in the district to provide fee concession to the children of journalist who have accorded recognized accreditation cards issued by the concerned authority in the JS Bhupalpally for the Academic Year 2025-2026.

District Educational Officer
Jayashankar Bhupalpally

To,
All the Correspondent / Secretary Private Un-Aided Schools in the district (through MEO'S concerned)
Copy to the Mandal Educational Officers in the district
Copy to the Journalist Unions in the JS Bhupalpally District
Copy submitted to the District Collector, JS Bhupalpally for kind information.
Copy to the file.

# జమాత్-ఎ-ఇస్లామీ హింద్ తెలంగాణ, రాష్ట్రంలోని ముస్లింల హక్కులు, సంక్షేమాన్ని ప్రభావితం చేసే కీలక అంశాలపై తీవ్ర ఆందోళన

**వ్యక్తం చేస్తూ. ముఖ్యంగా మూడు ప్రధాన అంశాలపై ప్రభుత్వాన్ని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్..**





**కరీంనగర్ టౌన్ జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** జమాత్-ఎ-ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. ముహమ్మద్ ఖాలిద్ ముబాశిర్ ఉజ్ జఫర్ ద్వారా విడుదల చేయబడింది,జమాత్-ఎ-ఇస్లామీ హింద్ (జెఐహెచ్) తెలంగాణ, రాష్ట్రంలోని ముస్లింల హక్కులు మరియు సంక్షేమాన్ని ప్రభావితం చేసే కీలకమైన అంశాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా మూడు ప్రధాన అంశాలపై ప్రభుత్వాన్ని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది: **1: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకత:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం 2025ను జెఐహెచ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధమైనది మరియు ముస్లిం మత సంస్థల స్వతంత్రతను హరిస్తుందని జెఐహెచ్ అభిప్రాయపడుతోంది. ఈ చట్టం వల్ల వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ అధికారుల హస్తక్షేపం పెరగడంతో పాటు, అనధికారిక వక్ఫ్ ఆస్తుల ఆక్రమణకు మార్గం వీలవుతుంది. జెఐహెచ్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న వ్యతిరేక ఉద్యమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరుతోంది. **2.తెలంగాణ మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోవడం:** ఇటీవల ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో ఒక్క ముస్లింకు కూడా అవకాశం ఇవ్వకుండా తప్పిపోయిన విధానాన్ని జెఐహెచ్ తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో 12.56% జనాభా ఉన్న ముస్లింలకు ప్రజాస్వామ్య పరంగా తగిన ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం రాజకీయ పక్కనబెట్టే ధోరణిగా భావించబడుతుంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ముస్లిం సమాజానికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని జెఐహెచ్ కోరుతోంది. కనీసం ఒక ముస్లింకు మంత్రిగా నియమించి ప్రజల సంకేతాన్ని గౌరవించాలని డిమాండ్ చేసింది. **3.ప్రభుత్వ పాఠశాలల పునరావాసం మరియు విద్యా రంగంలో సంస్కరణలు:** కొత్త విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మెరుగుపరచాలన్నదే జెఐహెచ్ అభిమతం. పాఠశాల భవనాల పునరుద్ధరణ, తాగునీరు, మౌలిక సదుపాయాలు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను కల్పించడంతో పాటు, గుణాత్మక విద్యకు అవసరమైన ఉపాధ్యాయుల నియామకాన్ని వేగవంతం చేయాలని కోరుతోంది. విద్యను సమాజ అభివృద్ధికి మూలస్తంభంగా భావిస్తూ, ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలని జెఐహెచ్ సూచిస్తోంది. ముగింపులో, జమాత్-ఎ-ఇస్లామీ హింద్ తెలంగాణ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ, ముస్లింలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఇవ్వాలని, వివక్షా చట్టాలను రద్దు చేయాలని, విద్య రంగాన్ని బలోపేతం చేయాలని పునరుద్ధరంగా కోరుతోంది.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అమలు పై సమీక్ష

- పథకం అమలులో మధ్యవర్తులు,దళారుల వల్ల మోసపోవద్దు
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్





**మహబూబాబాద్ కలెక్టరేట్, జూన్ 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకం పై గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె. వీరబ్రహ్మచారి, జడ్పీ సీఈవో పురుషోత్తం లతో కలిసి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, మండల పంచాయతీ విస్తరణ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ పథకం ద్వారా పేద ప్రజలకు స్వంత ఇంటి నిర్మాణాలు చేపట్టటం జరిగిందనీ, జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా బయ్యారం మండలం నామాలపాడు గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక కార్యచరణ ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులు వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేసి ఇందిరమ్మ కమిటీల ద్వారా గుర్తించి,ఆమోదం తెలిపి పనుల ప్రతిపాదనల ప్రకారం నిధులు మంజూరు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ,పట్టణ ప్రాంతాల్లో కమిటీ సభ్యులు, లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని, ఈ పథకం అమలు కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. జిల్లాలో అర్హులైన గిరిజన, పేద, బడుగు బలహీన వర్గాలలో నిజమైన లబ్ధిదారులు ఉన్నారని వారికి పథకం అమలులో వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు పథకం అమలులో మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మవద్దన్నారు. పూర్తిగా పారదర్శకంగా ప్రభుత్వం సూచించిన ప్రకారం కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వ సూచనలు ప్రకారం క్షేత్రస్థాయిలో స్థానిక వనరుల సేకరణ కోసం మైనింగ్, భూగర్భ జల శాఖల సమన్వయంతో కలిసి సర్వే నిర్వహించడం జరిగిందని, తదనంతరం ప్రభుత్వ సూచనల ప్రకారం తక్షణం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారుఈ సమావేశంలో డీఆర్డీఓ ప్రాజెక్టు డైరక్టర్ మధుసూదన రాజు, హౌజింగ్ పిడి రాజయ్య, సూపర్డెంట్ దామోదర్ రెడ్డి, జిల్లాలోనీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, శాంతికుమార్, నరేష్ రెడ్డి, ఉదయ్, మండల పంచాయతీ విస్తరణ అధికారులు, ఏఈలు, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# ఆధునాతన ఆర్థోపెడిక్ వైద్య సేవల్లో మరో కీలక ఘట్టం హైదరాబాద్ మలక్ పేట యశోదా ఆసుపత్రిలో ఒకేసారి రెండు మోకాలి చిప్పల మార్పిడి శస్త్రచికిత్స





**ఖమ్మం, జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** హైదరాబాద్ మలక్ పేటలోని యశోదా ఆసుపత్రి అధునాతనమైన ఆర్థోపెడిక్ వైద్య సేవల్లో మరో కీలక ఘట్టానికి నాంది పలికింది . ఖమ్మం జిల్లాలోని ఎన్కూరు ప్రాంతానికి చెందిన తుమ్మ నాగమణి కొన్ని సంవత్సరాలుగా తీవ్రమైన ఆస్టియో ఆర్థరైటిస్ , రుమటాయిడ్ ఆర్థరైటిస్ లతో బాధపడుతోంది . చాలాకాలంగా ఆమెకు అడుగు తీసి అడుగు వేయడం కూడా కష్టతరమైపోయింది . కనీసం తన పనులు తాను చేసుకోలేని స్థితికి రోగి చేరుకుంది . నిపుణులైన హైదరాబాద్ మలక్ పేట , యశోదా ఆసుపత్రి వైద్యబృందం ఆమెకు రెండు మోకాళ్లకూ ఒకేసారి మోకాలి చిప్పల మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి ఓ సరికొత్త జీవితాన్ని ప్రసాదించింది . తుమ్మ నాగమణి తీవ్రమైన మోకాలి నొప్పి , నడవడంలో తీవ్రస్థాయి ఇబ్బందులు , మోకాళ్ల జాయింట్లు పూర్తిగా దెబ్బతిన్న స్థితిలో హైదరాబాద్ మలక్ పేటలోని యశోదా ఆసుపత్రిలో చేరారు . వీటివల్ల ఆమె పూర్తిగా మంచానికే అంకితమైన పరిస్థితి . విస్తృతమైన వైద్య పరీక్షలు , క్లినికల్ మూల్యాంకనం , మరియు రేడియాలజికల్ పరిశీలనల అనంతరం , ఆమెకు ఎండ్-స్టేజ్ ఆస్టియోఆర్థరైటిస్ ఉందని వైద్యులు నిర్ధారించారు . దీనికి తోడు ఆస్టియోపోరోసిస్ , అంతకు ముందు చేసిన కుడి మోకాలిచిప్ప మార్పిడి ఆమె పరిస్థితిని మరింత దిగజార్చాయి . హైదరాబాద్ మలక్ పేట్ , యశోదా ఆసుపత్రి ఆర్థోపెడిక్ బృందం , సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కృష్ణ సుబ్రమణ్యం నాయకత్వంలో జనవరి 25, 2025న రోగికి విజయవంతంగా ఎడమ మోకాలి సంపూర్ణ మార్పిడి శస్త్ర చికిత్స చేసింది . అత్యాధునిక శస్త్రచికిత్సా పద్ధతులు , క్రమబద్ధమైన శస్త్రచికిత్స తర్వాతి చికిత్స (ఫిజియోథెరపీ) కారణంగా , తుమ్మ నాగమణి పరిస్థితి క్రమక్రమంగా మెరుగయ్యింది . ఆమె అతి తక్కువ సమయంలోనే తిరిగి చక్కగా నడవగలిగారు . కేవలం మూడు రోజుల్లో రోగి పూర్వ స్థితితో పోలిస్తే చాలా మెరుగైన కదలికలతో నడవగలిగే స్థాయికి చేరుకుని ఆసుపత్రినుండి డిశ్చార్జ్ అయ్యి పూర్తి స్వాతంత్ర్యంతో తన పనులు తాను చేసుకోగలిగే స్థితిలో ఇంటికి తిరిగి వెళ్లారు . హైదరాబాద్ మలక్ పేట యశోదా ఆసుపత్రిలో మాత్రమే కాక యశోదా అసుపత్రి అన్ని శాఖల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని , నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు , వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని డైరెక్టర్ గోరుకంటి పవన్ , యూనిట్ హెడ్ కె.శ్రీనివాసరెడ్డి , శ్రీనివాస్ చిదుర తెలిపారు . నిపుణులైన యశోదా ఆసుపత్రి వైద్య బృందం సాధిస్తున్నఅద్భుతమైన విజయాలకు , అందిస్తున్న అంతర్జాతీయ స్థాయి అత్యాధునికమైన వైద్య సేవలకు ఈ కేసు మరో చక్కటి ఉదాహరణ . హైదరాబాద్ మలక్ పేట యశోదా ఆసుపత్రిలో మాత్రమే కాక యశోదా అసుపత్రి అన్ని శాఖల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని , నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు , వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని మలక్ పేట యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్ , యూనిట్ హెడ్ కె.శ్రీనివాసరెడ్డి , జనరల్ మేనేజర్ శ్రీనివాస్ చిదుర లు ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు .

# నిర్దేశించిన గడువులోగా ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేయండి

- రెండు పడకల గదుల ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతులు కల్పన
- డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసం ఉండకుంటే రద్దు చేయండి.
- ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రౌండింగ్ అయిన యూనిట్లను నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని,డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పొంది,వాటిని వినియోగించని వారి స్థానంలో అర్హులైన లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. గురువారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పైన వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో తొలి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళను లబ్ధిదారులందరూ నిర్మించుకునేలా నిరంతరం సమీక్ష నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఏర్పడితే, వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 45 రోజుల గడువులోగా నిర్మాణం పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తయి లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాస ఉండకుండా ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వీటితో పాటు నోటరీ పేరుతో లబ్ధిదారులు తమ ఇళ్ళను విక్రయించినట్లు విచారణలో తేలితే వెంటనే రద్దు చేయాలని ఆదేశించారు. స్థానిక కోట కింద మిగిలిన ఇళ్లను సైతం అర్హులైన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న 5500 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రత్యేకతను పూర్తి చేయాలని. గృహ నిర్మాణ శాఖ ఎమ్ డి గౌతమ్ కు ఎమ్మెల్యే జిఎంఆర్ ఫోన్లో విజ్ఞప్తి చేశారు. వీటి నిర్మాణం పూర్తయితే నియోజకవర్గ పరిధిలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్లను కేటాయించడం సాధ్యమవుతుందని తెలిపారు.కొల్లూరు, ఉస్మాన్ నగర్, అమీన్పూర్ , కర్దనూర్, నాగులపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వ్యాపార సముదాయాలోని దుకాణాలను నోటిఫికేషన్ ద్వారా మాత్రమే కేటాయించాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా అర్హులకు మాత్రమే వీటిని అందించాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు నరసయ్య, పీడి చలపతిరావు, డిఈ రవీందర్, ఆయా మండలాల తహసిల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.









# విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**● విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లను అందజేసిన ఎంపీ ● వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**

**హనుమకొండ, జూన్ 12,(పిసిడబ్ల్యూ న్యూస్):**విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థు లంతా బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు. పోచంపల్లి, న్యూ శాయంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభ కార్యక్రమానికి ఎంపీ డా. కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లను అందజేశారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ... నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులందరికీ ఎంపీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే పాఠశాలను ప్రారంభమైన మొదటి రోజున విద్యార్థుల చేతికి యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయడం జరిగిందన్నారు. గతంలో తాను కడియం ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేసినట్లు తెలిపారు. నేడు ఎంపీగా మళ్ళీ పుస్తకాలు అందజేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఇటీవల వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని డీఈవోలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాల సమస్యల పట్ల సుదీర్ఘంగా చర్చించినట్లు ఎంపీ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం తమ బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోందని, అందులో భాగంగా ప్రైవేటు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, నాణ్యతతో కూడిన విద్యను అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డీ ఈ ఓ వాసంతి, ఇతర అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి



**తొర్రూరు ప్రతినిధి,జూన్ 12 (పిసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని పెద్ద దుబ్బ తండా గ్రామంలో నిర్వహించిన పల్లెబాట కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండా ప్రజలతో ముఖాముఖీ భేటీ నిర్వహించి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ధ్యేయం. ముఖ్యంగా తాండాలు ు ఆది వాసీ, గిరిజన ప్రజలు నివసించే ఈ ప్రాంతాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే మా కర్తవ్యంగా భావిస్తున్నాం.తాండాల్లో రోడ్లు, తాగునీటి సౌకర్యం, విద్య, ఆరోగ్య సేవలు వంటి అంశాలపై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు తీసుకుంటోంది. ప్రజల సహకారంతో ఇవి మరింత వేగంగా అమలవుతాయని ఆశిస్తున్నాను. ప్రజల సమస్యలను నేరుగా విని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, తక్షణ పరిష్కారం కోసం కృషి చేయడం మా బాధ్యత. అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు, మహిళా సంఘాలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామస్తులు వారి పర్యటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, తమ అభివృద్ధికి పార్టీ నుంచి అండగా ఉండాలంటూ ఆశాభావం వ్యక్తం చేశారు..





# తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నా,రే సంస్మరణ సభ

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,జూన్ 12,(పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఈ సి ఐ ఎల్ - కమలానగర్ లోని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ప్రముఖ కవి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి వర్ధంతి సంస్మరణ సభ సందర్భంగా సంస్మరణ జరిగింది. ఈ కార్యక్రమనికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు కార్యక్రమం ప్రారంభ సూచికగా తెలుగు నాడు దినపత్రిక ఎడిటర్ గుమ్మడి హరిప్రసాద్,ఆర్టీసీ విశ్రాంత అధికారి కృష్ణమాచార్యులు నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నారాయణరెడ్డి అభ్యుదయ కవితో పాటుగా అనేక అంశాలపై అనేక రచనలు చేశారని సినిమా రంగంలో కూడా ప్రవేశించి గొప్ప గొప్ప సినీ గీతాలను రచించారని చెప్పారు అంతేకాకుండా సోవియట్ భూమి పత్రికకు అనేక వ్యాసాలు కూడా వ్రాసారని చెప్పారు అనేకమంది కవులకు ప్రేరణకుడిగా ఉన్నాడని అన్నారు జయరాజు మాట్లాడుతూ ఆయన సోవియట్ యూనియన్ పతనం అనంతరం కమ్యూనిజం అంతం అయిపోయిందని చాలా పత్రికలు రాసినప్పటికీ ఎవడ్రా అన్నది కమ్యూనిజం పడిపోయిందని, తూర్పున సూర్యుడు ఉదయించినంత కాలం కమ్యూనిజం నిలుస్తుందని రాసిన కవిత్వం ప్రజల్లో ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చిందని చెప్పారు. యువ నాయకుడు గిరీష్ మాట్లాడుతూ సినిమా రంగంలో ఆయన విశేష కృషి చేశారని చెప్పారు, శారద, కోమటి రవి, శివరామకృష్ణ, రుక్కయ్య, భాస్కర రావు, కృష్ణమాచార్యులు, గుమ్మడి హరి ప్రసాద్ గార్లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శోభ, గౌసియా, జె చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొని కార్యక్రమన్ని విజయవంతం చేశారు.

# తొర్రూరు ప్రధాన రహదారిలో వాహనాలకు తప్పిన పెను ప్రమాదం?.

**● మిషన్ భగీరథ పైపు దొంగతనానికి గురైందా?**

**● ట్రాక్టర్‌లో నుండి జారిపడిన పైప్‌తో స్తంభించిన వాహనాలు**





**తొర్రూరు ప్రతినిధి, జూన్ 12(పీసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం -వరంగల్ జాతీయ రహదారిలో గల తొర్రూరు కూరగాయల మార్కెట్ సమీపంలో గురువారం మిషన్ భగీరథ కు సంబంధించిన ఒక పైపును ట్రాక్టర్లో వేసి తీసుకు వెళ్తుండగా ట్రాక్టర్లో నుండి జారి కింద పడిపోయింది. అదే సమయంలో భారీ వాహనాలు ఏమి రాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అసలు విషయానికి వస్తే మిషన్ భగీరథకు చెందిన ఒక భారీ వాటర్ పైపును ట్రాక్టర్లో దొంగతనంగా తీసుకువెళ్తున్నారని మిషన్ భగీరథ కార్యాలయానికి చెందిన వ్యక్తికి విషయం తెలవడంతో ఖమ్మం వైపు వెళ్తున్న ట్రాక్టర్ ను అడ్డుకొని తిరిగి మిషన్ భగీరథ కార్యాలయానికి తీసుకు వస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగింది. రహదారికి అడ్డుపడటంతో ట్రాఫిక్ పూర్తిగా జామ్ అయిన విషయాన్ని తెలుసుకొని జెసిబి సహాయంతో తిరిగి ట్రాక్టర్ లోకి పైప్ లైన్ ఎక్కించారు. ఈ సంఘటనపై మిషన్ భగీరథ కి చెందిన ఆ వ్యక్తిని పి సి డబ్ల్యూ న్యూస్ వివరణ కోరగా మిషన్ భగీరథకు చెందిన పైపులు దొంగలించకపోతున్నారు అనే విషయాన్నితెలుసుకొని ట్రాక్టర్ను అడ్డుకోవడం జరిగిందని పేర్కొన్నారు. అక్కడే ఉన్న ఒక గుత్తేదారుతో కార్యాలయంలో ఎవరికి తెలవకుండా ఇలా దొంగతనం గా తీసుకపోవటం సరికాదని సదరు వ్యక్తితో వాదనకు దిగారు. నీటి పైపును తీసుకు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ను అడిగితే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి అంటున్నారు స్థానికులు.

# భూ సమస్యలున్న ప్రతి రైతు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి: జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** గురువారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం పోతుల బొగడ గ్రామంలో జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సును సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం లో భాగంగా గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని, జూన్ 20 వరకు కొనసాగే ఈ రెవెన్యూ సదస్సులలో రైతులు పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో తమ పరిధిలో లేని అనేక సమస్యలకు ఈ కొత్త చట్టంలో అనేక మార్గాలు ఉన్నాయని తెలిపారు సులభంగా క్షేత్రస్థాయిలో సమస్యలు గ్రామ రెవెన్యూ పరిధిలో పరిష్కరించడం కోసం ప్రవేశపెట్టి మొదటిసారి పైలెట్ ప్రాజెక్టుగా కొనసాగి ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ సదస్సులు జరుగుతూ ఉన్నాయనీ,జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ గ్రామలలో షెడ్యూలు ప్రకారం ముందస్తుగా సమచారం అందించి సదస్సుల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అన్నారు, ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ఆర్డీవో పాండు సంబంధిత రెవెన్యూ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.








# గురుకుల విద్యార్థుల హక్కుల కోసం గళమెత్తిన ఏఐఎస్ఎఫ్

**- సంక్షేమ భవన్ ముట్టడిలో పాల్గొన్న గ్యార నరేష్**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ పాలకులకు ఓ ప్రశ్న:విద్యను ఓ అధికారం సాధించే మార్గంగా మాత్రమే చూస్తారా?లేదా? పిల్లల భవిష్యత్తుని మలిచే బాధ్యతగా భావిస్తారా? గురుకులాల్లో గదుల లేమి, ఉపాధ్యాయుల కొరత, నీటికి, భద్రతకు బేసిక్ వసతులే లేకపోవడం,విద్యార్థులు నేలపై పడుకుంటున్న దుస్థితి.ఇవన్నీ మీ అధికార దృష్టికి కనిపించడంలేదా?ఈ సందర్భంగా గ్యార నరేశ్ మాట్లాడుతూ విద్యను నిర్లక్ష్యం చేసే పాలకులకు చరిత్ర క్షమించదు. గురుకులాల్లో విద్యార్థుల తలపాగాలు పాడవుతున్న వేళ ఏఐఎస్ఎఫ్-పోరాడుతుంది.ఈ పోరాటం ఓ హెచ్చరిక.పేద విద్యార్థుల సమస్యలను రాజకీయం చేయకుండా, వెంటనే భవనాల అభివృద్ధి, ఉపాధ్యాయ నియామకాలు, వసతి సౌకర్యాల మెరుగుదల కోసం చర్యలు చేపట్టాలి. లేకపోతేగురుకులాల చరిత్రలో మీ నిర్లక్ష్యం ఒక నల్ల పుటగా నిలుస్తుంది.ఏఐఎస్ఎఫ్ ముందుంటుంది విద్యార్థుల మెడలు వంచే వారికి కాదు,వారి మెదళ్లను వెలిగించే వేదికగా నిలవడానికే!

# నిషేధిత పత్తి విత్తనాలు

**- ఇద్దరు వ్యక్తులపై కేసులు**




**చిట్యాల,జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని నైన్ పాక మరియు కుమ్మరి పల్లి గ్రామంలో చిట్యాల ఎస్ఐ జి శ్రవణ్ కుమార్ గ చిట్యాల ఏఓ గారితో ఏకకాలంలో సోదాలు నిర్వహించడం వలన 1) కుమ్మరి పల్లి గ్రామానికి చెందిన బిక్కనూరు విజయ్ సన్నాఫ్ సాంబయ్య 2) నైన్ పాక గ్రామానికి చెందిన సంఘ కుమార్ సన్ ఆఫ్ బిక్షపతి ల దగ్గర తెలంగాణ రాష్ట్రంలో సేద్యం చేయడానికి అనుమతి లేని పత్తి గింజలు 1)R-COTT-999 BG 5% 32 ప్యాకెట్లు 3) THE CAPTAIN pink Gard 5G ఆరు ప్యాకెట్లు 4) అరకిలో విడి విత్తనాలు వాటి విలువ సుమారు 32,800 లభించగా చిట్యాల ఏఓ సదరు వ్యక్తులపై దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ తెలిపారు

# విత్తన షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

**మంథని:జూన్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంథని మండలంలో గురువారం రోజున టాస్క్ ఫోర్స్ తనిఖీల్లో భాగంగా నకిలీ విత్తనాలని అరికట్టాలని ఏడిఏఇన్ అంజని మండల వ్యవసాయ అధికారి దాసరి నవ్య,ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో డీలర్ షాప్స్ లో ఆకస్మికంగా తనిఖీలను నిర్వహించారు.ఈ తనిఖీల్లో అనాధికార విత్తనాలు,ఎరువులను అమ్మినచో కఠిన చర్యలు తీసుకోబడతాయని డీలర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. రైతులకి కొనుగోలు చేసిన విత్తనాలకు షాప్ నిర్వాహకులు రసీదు ఇవ్వనిచో మాకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో విడి గా సంచులలో విత్తనాలు విక్రయాలు జరిగితే వ్యవసాయ శాఖ అధికారి దృష్టికి తేవాలని సూచించడం సూచించడం జరిగింది

## వివాదాలకు చెక్.. సీఎం చంద్రబాబుతో
# సినీ పెద్దల భేటీకి ముహూర్తం ఖరారు




ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలు, వివాదాలకు త్వరలో తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. సీఎం చంద్రబాబుతో సినీ పరిశ్రమకు చెందిన కీలక వ్యక్తుల సమావేశానికి ముహూర్తం ఖరారైంది. ఈ భేటీతో ప్రస్తుతం నెలకొన్న అనేక అపరిష్కృత అంశాలకు ఒక ముగింపు లభిస్తుందని పరిశ్రమ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్నా, సినీ పరిశ్రమ పెద్దలతోగానీ, ప్రభుత్వ అధికారులతోగానీ ఇప్పటివరకు సరైన చర్చలు జరగలేదన్న అసంతృప్తి కొంతకాలంగా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా నటుడు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల ఈ విషయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఇంతకాలమైనా ముఖ్యమంత్రితో అధికారిక సమావేశం జరగకపోవడంపై ఆయన గట్టిగానే తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నెల 15వ తేదీన ఉండవల్లిలో చంద్రబాబును కలిసేందుకు అప్పాయింట్ మెంట్ కోరారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఈ మేరకు అప్పాయింట్ మెంట్ ఖరారైనట్లు సమాచారం. దాదాపు 30 మంది వరకు సినీ రంగ ప్రముఖులు ఏపీ సీఎంను కలవనున్నట్లు తెలుస్తోంది. అల్లు అరవింద్, దిల్ రాజు పరిశ్రమ నుంచి పెద్దలుగా తమ సమస్యలను చంద్రబాబుకు వివరించనున్నారు. త్వరలో జరగనున్న ఈ సమావేశం, సినీ పరిశ్రమకు ప్రభుత్వానికి మధ్య ప్రత్యక్ష చర్చలకు వేదిక కానుంది. ఈ భేటీలో ప్రధానంగా సినిమా నిర్మాణం, ప్రదర్శనకు సంబంధించిన విధానాలు, పన్నుల అంశాలు, బెనిఫిట్ షోలు, టికెట్ ధరల నియంత్రణ వంటి కీలక విషయాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా, ఇటీవల కొన్ని పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు, ప్రత్యేక ప్రదర్శనలకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఈ అంశాలపై స్పష్టత వస్తుందని ఆశిస్తున్నారు. చాలాకాలంగా టాలీవుడ్‌కు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య ఉన్న సత్సంబంధాలకు కొంతకాలంగా అడ్డంకిగా మారిన వివాదాలకు ఈ సమావేశంతో ఎండ్ కార్డ్ పడుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## కొణిదెల నిహారిక 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్'
# నుంచి కాస్టింగ్ కాల్...



నటిగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన కొణిదెల నిహారిక, నిర్మాతగానూ తనదైన ముద్ర వేస్తున్నారు. 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' అనే నిర్మాణ సంస్థను స్థాపించి, విభిన్నమైన కథాంశాలతో చిత్రాలను నిర్మిస్తూ కెరీర్‌లో చురుగ్గా ముందుకు సాగుతున్నారు. తాజాగా ఈ సంస్థ నుంచి మరో కొత్త సినిమా రాబోతోంది. ఈ సినిమా కోసం కొందరు బాల నటుల అవసరం ఉందని తెలుపుతూ, కాస్టింగ్ కాల్‌ను అధికారికంగా ప్రకటించారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ నిర్మిస్తున్న తమ ప్రొడక్షన్ నెం. 2 చిత్రంలో నటించేందుకు చిన్నారుల కోసం అన్వేషణ మొదలుపెట్టినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా 3 నుంచి 6 సంవత్సరాల వయసున్న బాలికలు ఈ సినిమాలోని పాత్రలకు కావాలని వారు తెలిపారు. కెమెరాను ఇష్టపడే, నటన పట్ల ఆసక్తి, ప్రతిభ కనబరిచే చిన్నారులకు ఇది ఒక మంచి అవకాశం అవుతుందని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ కాస్టింగ్ కాల్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను కూడా తెలియజేశారు. తమ పిల్లలను ఈ సినిమాలో నటింపజేయాలనుకునే తల్లిదండ్రులు, వారి ప్రొఫైల్స్‌ను **pinkelephantpictures2@gmail.com** అనే ఈమెయిల్ చిరునామాకు పంపించాలని సూచించారు. ప్రొఫైల్స్ పంపేందుకు మరో మార్గంగా 9100480537 అనే వాట్సాప్ నంబర్‌ను కూడా అందుబాటులో ఉంచారు. "మీ చిన్నారితోనే తదుపరి పెద్ద కథ ప్రారంభం కావచ్చు" అంటూ చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో ఈ ప్రకటన వెలువరించారు. ఈ చిత్రానికి నిహారిక నిర్మాత కాగా, మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్నారు. త్వరలోనే ఇతర తారాగణం, టెక్నీషియన్ల వివరాలు ప్రకటించనున్నారు.

# రూమర్లకు చెక్..
## త్రివిక్రమ్ తదుపరి సినిమాలపై నాగవంశీ క్లారిటీ



ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ చేపట్టబోయే తదుపరి చిత్రాలపై సినీ వర్గాల్లోనూ, అభిమానుల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అల్లు అర్జున్, రామ్ చరణ్ తదితర స్టార్ల పేర్లు వినిపించాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ నిర్మాత నాగవంశీ తాజాగా స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ లైనప్‌పై వస్తున్న ఇతర కథనాలపై నిర్మాత నాగవంశీ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ద్వారా స్పందించారు. "త్రివిక్రమ్ గారి తదుపరి రెండు ప్రాజెక్టులు వెంకటేశ్, జూనియర్ ఎన్టీఆర్ అన్నతో ఖరారయ్యాయి. మిగిలినవన్నీ కేవలం ఊహాగానాలే. త్రివిక్రమ్ గారి ఏ ప్రాజెక్ట్ ఖరారైనా నేనే అధికారికంగా ప్రకటిస్తాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రకటనతో త్రివిక్రమ్ ముందుగా వెంకటేశ్‌తో ఒక సినిమా పూర్తి చేసి, ఆ తర్వాత జూనియర్ ఎన్టీఆర్‌తో పౌరాణిక చిత్రాన్ని ప్రారంభిస్తారని స్పష్టమైంది. దీంతో ఇతర హీరోలతో త్రివిక్రమ్ సినిమాలు చేయనున్నారంటూ వస్తున్న వార్తలు కేవలం వదంతులేనని తేలిపోయింది. మరిన్ని అధికారిక వివరాలు త్వరలో వెలువడే అవకాశం ఉంది.

ఇక, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై త్రివిక్రమ్ దర్శకత్వంలో తారక్ కథానాయకుడిగా ఓ సోషియో-మైథలాజికల్ ఫాంటసీ చిత్రం రూపుదిద్దుకోనుందని సమాచారం. పౌరాణిక పాత్రలో ఎన్టీఆర్ నటించనుండటం ఇదే తొలిసారి కావడంతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి.

# 'మిత్రమండలి' టీజర్.. నవ్వులే నవ్వులు!



టాలీవుడ్ యువ నటులు ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రల్లో మిత్రమండలి మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. కంప్లీట్ కామెడీ ఎంటర్టైనర్ మూవీగా ఎస్ విజయేందర్ దర్శకత్వం వహిస్తుండగా, సోషల్ మీడియా ఫేమ్ నిహారిక ఎన్.ఎం. ఫిమేల్ లీడ్ రోల్ లో యాక్ట్ చేస్తున్నారు. ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ సమర్పణలో కల్యాణ్ మంతిన, భానుప్రతాప, డా. విజయేందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రీ లుక్, ఫస్ట్ లుక్ ను మేకర్స్ రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ ను జరుపుతున్న మేకర్స్, మరో అప్డేట్ ఇచ్చారు. రీసెంట్ గా అనౌన్స్ చేసిన విధంగా గురువారం మిత్రమండలి మూవీ టీజర్ ను రిలీజ్ చేశారు. వరల్డ్ అండ్ గ్యాంగ్ ఆఫ్ మిత్రమండలి అంటూ బన్నీ వాస్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రస్తుతం టీజర్.. అందరినీ ఆకట్టుకుని సందడి చేస్తోంది. మూవీలో ఎంత కామెడీ ఉంటుందో టీజర్ ద్వారా అర్థమవుతుంది. ఇదొక మంచి మ్యాచ్ ఆడటానికి అనుకూలమైన వాతావరణం టీజర్ స్టార్ట్ అయింది. ఈ బ్యాట్స్ మెన్ పైనే అన్ని హౌప్స్ పెట్టుకొన్న బౌలింగ్ టీమ్.. అండర్ 19లో 20 ఇయర్స్ గా ఆడుతున్న స్పిన్ బౌలర్.. వికెట్ కీపర్ ఉత్సాహం చూస్తుంటే అన్ని గోల్స్ ఆపేలా ఉన్నాడు.. ఈ ఫీల్డర్ బౌండరీని వదిలేసి తెలివిగా తన బంతుల్ని కాపాడుకున్నాడు.. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోకుండా.. ఫీల్డింగ్ ఎంచుకుంది అంటూ లీడ్ రోల్స్ ను మేకర్స్ పరిచయం చేశారు. వారంతా బ్యాట్ లేకుండా క్రికెట్.. బోర్డు లేకుండా క్యారమ్స్ ఆడతారు.. ఎవరో ఒకరిని వెర్రి పప్ప చేస్తారని మాట్లాడుకుంటూ కనిపిస్తారు. ఆ తర్వాత ఇంపాక్ట్ ప్లేయర్ గా సత్య రంగంలోకి దిగుతారు. అప్పుడే స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ ఎస్ ఐ గా ఎంట్రీ ఇస్తారు. ఓవరాల్ గా సినిమాలోని రోల్స్ ను మేకర్స్ టీజర్ ద్వారా రివీల్ చేసేశారు. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ క్రేజీ అండ్ ఫన్నీగా ఉంది. సినిమా మాత్రం మంచి ఎంటర్టైన్మెంట్ ను అందించనుందని క్లియర్ గా తెలుస్తోంది. టీజర్ అంతా పంచ్ ల తోనే ఉండగా, డైలాగులు ఫన్నీగా ఉన్నాయి. క్యారెక్టరైజేషన్లు ఇంకా క్రేజీ గా ఉన్నాయి. రన్నింగ్ కామెంట్రీ నవ్వులు పూయిస్తోంది. మొత్తానికి టీజర్.. సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తోంది. మరి సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో.. ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## దేవుడి దయ వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు: నిఖిల్

యువ హీరో నిఖిల్ సిద్దార్థ్ నటిస్తున్న 'ది ఇండియా హౌస్' సినిమా చిత్రీకరణలో అపశ్రుతి చోటుచేసుకుంది. శంషాబాద్ సమీపంలో వేసిన భారీ సెట్‌లో నిన్న రాత్రి ఈ ప్రమాదం జరిగింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదని, తామంతా క్షేమంగా ఉన్నామని హీరో నిఖిల్ తెలిపారు. ప్రమాదం గురించి నిఖిల్ మాట్లాడుతూ, "ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందించే ప్రయత్నంలో కొన్నిసార్లు రిస్కులు తప్పవు. అలాంటి సమయంలోనే ఈ ఘటన జరిగింది. మా సిబ్బంది తీసుకున్న తక్షణ జాగ్రత్తల వల్ల పెను ప్రమాదం నుంచి బయటపడ్డాం. కానీ, దురదృష్టవశాత్తూ కొన్ని ఖరీదైన పరికరాలను కోల్పోయాం. దేవుడి దయ వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు, అందరం సురక్షితంగా ఉన్నాం" అని తెలిపారు.

వివరాల్లోకి వెళితే, శంషాబాద్ సమీపంలో 'ది ఇండియా హౌస్' సినిమా కోసం ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో సముద్రపు సన్నివేశాల చిత్రీకరణకు ఏర్పాటు చేసిన భారీ వాటర్ ట్యాంక్ అకస్మాత్తుగా పగిలిపోయింది. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున నీరు సెట్‌లోకి దూసుకువచ్చింది. ఈ ఘటనలో పలువురు సినిమా సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. వారికి వెంటనే ప్రాథమిక చికిత్స అందించారు. అయితే, నీటి ప్రవాహానికి సెట్‌లోని విలువైన కెమెరా పరికరాలు, ఇతర సామగ్రి తడిచిపోయి నష్టం వాటిల్లినట్లు సమాచారం.

ఈ సినిమాలో నిఖిల్ సరసన సయీ మంజ్రేకర్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. 1905 కాలం నాటి ప్రేమ, విప్లవం వంటి అంశాలతో కూడిన ఆసక్తికర కథాంశంతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ ప్రమాదం కారణంగా చిత్రీకరణకు స్వల్ప అంతరాయం కలిగినప్పటికీ, త్వరలోనే తిరిగి ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.





# డైరెక్టర్ గా కాజల్

టాలీవుడ్ ఆడియన్స్ ను కట్టిపడేసిన హీరోయిన్లలో చందమామ కాజల్ కూడా ఒకరు. స్క్రీన్ పై ట్రెండీ గా కనిపించడంతో పాటూ హీరోల పక్కన మాస్ స్టెప్పులేస్తూ తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన కాజల్ కేవలం సినిమాలే కాకుండా వెబ్‌సిరీస్‌లు, స్పెషల్ సాంగ్స్ కూడా చేస్తూ తనదైన గుర్తింపు తెచ్చుకుంది. పాన్ ఇండియన్ హీరోయిన్ గాపేరు తెచ్చుకున్న కాజల్, తెలుగు సినిమాల్లో నటించి బాగా పాపులర్ అయింది.మొదట్లో గ్లామరస్ పాత్రల్లో నటించినా, ఆ తర్వాత మగధీర, చందమామ లాంటి సినిమాల్లో మంచి పాత్రలు చేసి మెప్పించిన కాజల్, ఆ తర్వాత తమిళంలో అందాల ఆరబోతకే ఎక్కువగా పరిమితమైంది. మధ్యలో ఒకటి రెండు లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేసినా అవి ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. 2020లో గౌతమ్ కిచ్లుని పెళ్లి చేసుకుని మధ్యలో కొన్నాళ్ల పాటూ కాజల్ ఇండస్ట్రీకి దూరమైంది. బాబు పుట్టాక మళ్లీ ఇండస్ట్రీకి రీఎంట్రీ ఇచ్చిన కాజల్, ప్రస్తుతం కమల్ హాసన్ చేస్తున్న ఇండియన్3లో ఓ కీలక పాత్రలో నటిస్తోంది. దీంతో పాటూ మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్టుగా వస్తున్న మైథలాజికల్ మూవీ కన్నప్పలో పార్వతీదేవిగా నటించింది. ఇవి కాకుండా కాజల్ చేతిలో కొత్త అవకాశాలేమీ లేవు. ఓ వైపు కమర్షియల్ యాడ్స్ లో నటిస్తూ, మరోవైపు సొంత బిజినెస్ లతో కూడా కాజల్ బిజీగా ఉంది.

అయితే సినిమాల పరంగా తనకు ఛాన్సులు తక్కువైన నేపథ్యంలో మళ్లీ అవకాశాలను దక్కించుకోవాలనే ఆలోచనతో కాజల్ ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే కాజల్ మెగాఫోన్ ను పట్టి డైరెక్టర్ గా సినిమా చేయాలని చూస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. ప్రైమ్ టైమ్ లోకి రావాలనే ఆలోచనతో స్వీయ దర్శకత్వంలో హీరోయిన్ గా సినిమా చేయాలని చూస్తోందట.

బాలీవుడ్ లో కమర్షియల్ అంశాలతో ఓ సినిమాను తెరకెక్కించడానికి కాజల్ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఆల్రెడీ కెరీర్లో స్టార్ స్టేటస్ ను ఎంజాయ్ చేసిన కాజల్ ఇప్పుడు వచ్చిన ఆఫర్లను చేసుకుంటూ, వ్యాపారాలను చేసుకోకుండా అనవసరంగా డైరెక్టర్ గా మారి రిస్క్ చేయడం ఎందుకని ఆమె ఫ్యాన్స్ భావిస్తున్నారు. మరి కాజల్ మనసులో ఏముందో చూడాలి